# 32

# రాజ్యమును గూర్చిన మరిన్ని ఉపమానములు

## (13:24-52)

రాజ్యమును గూర్చిన తరువాత ఉపమానములలో వినియోగింపబడిన వస్తుసమూదాయము యేసు చెప్పుచుండిన ఉపమాన సహిత ఉపదేశములను వినుచుండినవారికి సుస్పష్టముగాను. సుపరిచితమైనవిగాను ఉండును.

### పరలోక రాజ్యమును గూర్చిన మూడు అదనపు ఉపమానములు (13:24-33)

**గురుగులు (13:24-30)**

**[24]ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను, ఏమనగా-పరలోకరాజ్యము, తన పొలములో మంచి విత్తనము విత్తిన యొక మనుష్యుని పోలియున్నది. [25]మనుష్యులు నిద్రించుచుండగా, అతని శత్రువు వచ్చి గోధుమల మధ్యను గురుగులు విత్తిపోయెను. [26]మొలకలు పెరిగి గింజపట్టినప్పుడు గురుగులు కూడ అగపడెను. [27]అప్పుడు ఇంటి యజమానుని దాసులు అతనియొద్దకు వచ్చి అయ్యా, నీవు నీ పొలములో మంచి విత్తనము విత్తితివి గదా, అందులో గురుగులెక్కడనుండి వచ్చినవని అడిగిరి. [28]ఇది శత్రువుచేసిన పని అని అతడు వారితో చెప్పగా, అ దాసులు-మేము వెళ్లి వాటిని పెరికి కూర్చుట నీకిష్టమా? అని అతనిని అడిగిరి. [29]అందుకతడు-వద్దు; గురుగులను పెరుకుచుండగా, వాటితోకూడ ఒకవేళ గోధుమలను పెల్లగింతురు. [30]కోతకాలమువరకు రెంటినికలిసి యెదుగనియ్యుడి; కోతకాలమందు గురుగులను ముందుగాకూర్చి వాటిని కాల్చి వేయుటకు కట్టలు కట్టి, గోధుమలను నా కొట్టులో చేర్చి పెట్టుడని కోతగాండ్రతో చెప్పుదుననెను.**

**వచనము 24.** మత్తయి, ప్రభువు దోనెలో ఉండి ఉపదేశించుచుండినప్పటి సన్నివేశము వైపు తిరిగాడు (13:1, 2). విత్తువాని గూర్చిన కథను చెప్పిన తదుపరి (13:3-9), **యేసు మరియొక ఉపమానము** జనసమూహములతో చెప్పెను (13:31, 33 చూడు). ఈ అధ్యాయములోని ఇతర ఉపమానముల వలెనే, **ఇది పరలోక రాజ్యమునకు** సంబంధించినదై యున్నది (13:31, 33, 44, 45, 47). ఈ ఉపమానములోని ఇంటి యజమానుడు **తన పొలములో మంచి విత్తనములు విత్తెను**; ఆ విత్తనము "గోధుమలని" వచనము 25 సూచించుచున్నది. అతడు మంచి విత్తనమును విత్తినందువలన, హేతుబద్ధముగా అతడు మంచి కోతను ఆశించాడు. అట్లయినప్పటికిని, విషయము అలా లేకుండినది.

**వచనము 25.** యజమానుని **దాసులు నిద్రించుచుండిరను** వాస్తవము, వారు సోమరులై యుండిరను ధ్వనింపు నీయదు; అది రాత్రివేళ గనుక వారు మామూలుగా నిద్రించుచుండిరి. అయితే ఇట్టి నిద్ర **శత్రువు** వచ్చి విత్తబడిన మంచి పంటనంతటిని పాడుచేయునట్లు వానికి

అనుకూలమైన అనుమతినిచ్చినది. **గురుగులు**, దూషితమైన “పైరును చెరిపెడు కలుపు మొక్కలై” యుండవచ్చును (NEB చూడు), అవి మధ్యప్రాచ్యమును మినహాయించి ప్రాచీన మధ్యధరా ప్రాంతము మరియు నైరుతి భారత దేశములో విస్తారముగా ఎదుగుచుండినవి. నిర్దిష్టమైన ఈ రకము మొక్కలు, గోధుమల వలెనే కనిపించు విషపూరితమైన గడ్డిని పోలిన “గడ్డిపోచల వంటి కలుపు మొక్కలు” అయియుండవచ్చును. ఇటువంటి కలుపు మొక్కలు మరియు గోధుమలు కలిసిన పదార్థమును తినువాడు అనారోగ్యస్తుడగును.

పగతీర్చుకొను చర్యగా శత్రువు యొక్క పొలములో గురుగులను విత్తుట యేసు కాలములో ఒక చెడు అభ్యాసమై యుండినది, గనుక రోమా శాసనము చేత అట్టి అలవాటు నిషేధింపబడినది.[1] యేసు బోధలు వినుచుండినవారు ఈ ఉపమానములోని ఇతివృత్తమునుబట్టి ఎవ్విధంగాను దిగ్భ్రాంతిచెందలేదు.

**వచనములు 26-28. మొలకలు పెరిగి గింజపట్టినప్పుడు, పంటలో గురుగులు కూడ స్పష్టముగా అగపడెను.** అవి మొలకెత్తునప్పుడు వాటి ప్రారంభ దశలో, ఏవి గురుగులో ఏవి గోధుమలో వేరు వేరుగా గుర్తుపట్టరాదు. ఏదిఏమైనా, మొక్కలు పెరిగినప్పుడు, పంట గూర్చి ఎరిగినవారికి ఈ రెండింటి మధ్య గల భేదము విదితముగా తెలియును. గురుగులుండుట అసాధారణమైన విషయమేమీ కానిదై యుండును, కానీ వాటి భారీ మొత్తము దాసులను ఆశ్చర్యపరచినది. వారు ఈ విషయాన్ని తమ యజమానునికి, **భూస్వామికి** (*oikodespotēs*) తెలియజేసినప్పుడు, ఆయన ఏమి జరిగియుండవచ్చునో యను విషయాన్ని వెంటనే తెలిసికొన్నాడు గనుకనే, **ఇది శత్రువు చేసిన పని** అని అబ్బురపడుచు అన్నాడు. దాసులు ఆ గురుగులను పెరికివేయవలెనని అనుకొన్నారు, కానీ గోధమలకు నష్టము కలిగించకుండా గురుగులు పెరికివేయబడజాలవని తెలసికొనుటకు యజమాని చాలినంత తెలివిమంతుడై యుండెను. అప్పటికే, గురుగులు మరియు గోధుమల వేళ్లు ఒకదానితో మరొకటి అల్లుకొనిపోయి యుండును గనుక గురుగులను పెరికివేయుటకు చేయబడు ఎటువంటి ప్రయత్నమైనను, గురుగులతో పాటు గోధుమలను సహితము పెల్లగించును.

**వచనములు 29, 30.** భూస్వామి యొక్క పరిష్కారము వివేకవంతమైనదై యుండినది. కోతకాలము వరకు ఆ రెండింటిని, అనగా **గురుగులు మరియు గోధుమలను** యెదుగనియ్యవలెనని అతడు తన దాసులతో చెప్పాడు **కోతకాలమందు**, నిపుణులైన కోతగాండ్ర చేత అవి వేరుచేయబడును. అప్పుడు గురుగులు ముందుగా కూర్చబడి, కట్టలుగా కట్టబడి కాల్చివేయబడును, మరియు గోధుమలు భూస్వామి యొక్క కొట్టులోనికి చేర్చబడును (3:12; 6:26 చూడు).

గోధుమల నుండి గురుగులను వేరుచేయుటకు మూడు పద్ధతులు అమలులో ఉండినవి. (1) గోధుమలు గురుగులు కంటె ఎక్కువ ఎత్తుగా ఎదిగినప్పుడు, అవి వాటికి పైఎత్తులో కోయబడినవి, ఆ తరువాత పొలము కాల్చివేయబడినది. (2) గురుగులు మరియు గోధుమలు కోత కోయబడుచుండిన సమయంలో వేరుచేయబడినవి, గోధుమలు మరపట్టింపబడుటకు కట్టలుగా కట్టబడినవి, గురుగులు కుప్పలు కుప్పలుగా పేర్చబడి కాల్చివేయబడినవి. (3) మంచి కోత మరపట్టింపబడక మునుపు చెడు విత్తనములు మంచి విత్తనముల నుండి వేరుచేయబడినవి. చెప్పబడిన ఉపమానములో ఆ దాసులు రెండవ పద్ధతిని వినియోగించారు.

విత్తువాని గూర్చిన ఉపమానమునకు వలెనే, యేసు ఈ ఉపమానమును అటుతరువాత వివరించాడు (13:36-43).

**ఆవగింజ (13:31, 32)**

**31ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను-పరలోకరాజ్యము, ఒకడు తీసికొని తన పొలములో విత్తిన ఆవగింజను పోలియున్నది. 32అది విత్తనములన్నిటిలో చిన్నదేగాని పెరిగినప్పుడు కూర మొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశపక్షులువచ్చి దాని కొమ్మలయందు నివసించునంత చెట్టగును.**

**వచనములు 31, 32**. తరువాత **ఉపమానములో, పరలోక రాజ్యము ఒక ఆవగింజతో పోల్చబడినది.** ఈ విత్తనము అక్షరాలా ఇతర **విత్తనములన్నిటి కంటె చిన్నది కాదు**, కానీ "మూలిక" విత్తనములలో అతి చిన్నది. ఉదాహరణ అడవి పూల మొక్కలు మరియు తుంగ చెట్టు విత్తనములు, వాటి పరిమాణములో చాలా చిన్నవిగా నుండును. యేసు ఆవగింజను ఇతర మొక్కలన్నిటి విత్తనములతో పోల్చుచుండలేదు, కానీ పాలస్తీనా దేశములో మాత్రమే ఎదుగుచుండిన మూలికల మొక్కలతో పోల్చుచుండెను. ఆవగింజ దాని బుల్లి పరిమాణమునుబట్టి ఒక సామెత రూపముగా చెప్పుకొనబడుచుండినది ("ఆవగింజంత అల్పముగా").[2] యేసు ఈ సోదాహరణ చిత్రీకరణమును ఆయన బోధించుచుండిన ఇతర సందర్భములలో కూడ ప్రయోగించాడు (17:20; లూకా 17:6).

ఆవగింజ మొక్క ప్రత్యేకముగా పాలస్తీనాలోని పొడి వాతావరణములో చక్కగా ఎదుగుచుండిన ఒక మొక్కయై యున్నది. సముద్రమునకు సమీపమున సాగుచేయబడుచుండిన రకము మొక్క ఇతర ప్రాంతములలో సాగుచేయబడిన దాని వలె గాక, **ఒక వృక్షము**[3] ఎదుగునంత ఎత్తు వరకు ఎదుగగలదు. డబ్ల్యు. ఎఫ్. ఆల్‌బ్రైట్ మరియు సి. ఎస్. మన్న్ ఇలా వ్రాయుచున్నారు, "ఆవగింజ మొక్క గలిలయ సముద్ర తీరములో సామాన్యముగా పది అడుగల ఎత్తు వరకు ఎదుగును."[4] దాని గూర్చి తగు శ్రద్ధ వహింపబడినప్పుడు, అది పదిహేను అడుగుల ఎత్తు వరకు కూడ ఎదుగగలదు. ఈ రకమైన ఆవగింజ మొక్కల **కొమ్మలు** సంవత్సరములోని కొన్ని నిర్దిష్టమైన సమయములలో వంగకుండా గట్టిగా నుండునవై యుండును గనుక **ఆకాశపక్షులు** వాటి కొమ్మలపై సులభముగా గూళ్లు కట్టుకొనగలవు.

"ఒక చెట్టు" అని ఆవగింజ మొక్క గూర్చి చెప్పబడుచున్న అతిశయోక్తియైన ప్రస్తావన, చెట్లతో పోల్చబడుచు చెప్పబడిన రాజ్యముల గూర్చిన పాత నిబంధన ప్రస్తావనలతో ఒక సమానాంతమును గుర్తుచేయుచున్నది. ఉదాహరణ యెహెజ్కేలు గ్రంథంలో, దేవుడు దేవదారువృక్షపు పైకొమ్మ శాఖలలో లేత దాని నొకటి తీసి అత్యున్నత పర్వతము మీద నాటును. అది "ఒక గొప్ప దేవదారు వృక్షమగును" గనుక ఆకాశపక్షులు వాటిని ఆశ్రయముగా దాని కొమ్మలలో వాటి గూళ్ళను సులభముగా కట్టుకొనును (యెహెజ్కేలు 17:22-24; 31:2-18; దానియేలు 4:10-12, 19-22 చూడు).

ఆవగింజ వలెనే, పరలోక రాజ్యము దాని ప్రారంభంలో అల్పమైనదిగా ఉండినది కానీ చివరకు బహు గొప్పదైనదగును. యేసు పన్నెండు మంది అపొస్తలులతో ఆరంభించాడు, కానీ

ఆయన రాజ్యము చివరకు భూమియందంతటను వ్యాపించును (28:19; మార్కు 16:15). యూదా మతస్తుల సాహిత్యములో అన్యజనులను సూచించుటకు కొన్ని పర్యాయములు ఆకాశపక్షులు ప్రస్తావింపబడినవి.[5]

**పులిసిన పిండి (13:33)**

**[33]ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను-పరలోకరాజ్యము, ఒక స్త్రీ తీసికొని పిండి అంతయు పులిసి పొంగువరకు మూడు కుంచముల పిండిలో దాచి పెట్టిన పుల్లని పిండిన పోలియున్నది.**

**వచనము 33. పులుపు,** రొట్టెలు తయారుచేయుటకు ఉపయోగింపబడిన ఒక వస్తుగతాంశమై యున్నది. అది లోలోపల నుండి దాని పని చేయును. క్రొత్త నిబంధన కాలములో, **ఒక స్త్రీ** సాధారణముగా రొట్టెలు తయారుచేయుటకు పిసికిన పిండిముద్ద చేత చేయబడిన రొట్టెలు కాల్చబడక మునుపే దానిలో నుండి పులిసిన పిండి ముద్ద నొకదానిని తీసి ప్రక్కనబెట్టును. పిసికిన పిండి ముద్ద అయిపోయిన తరువాత, తానిదివరకు ప్రక్కనబెట్టుకొన్న పులిపిండి ముద్దను యింకా కొంచెము పిండిలో కలిపి, పిసికి, రొట్టెలు తయారు చేయుటకు మరొక ముద్దను సిద్ధము చేసికొనును (1 కొరింథీయులకు 5:6 చూడు).[6] దాదాపుగా ఒక కుంచము పొడి పిండి, **వంద మందికి ఆహారము పెట్టుటకు చాలినంత పిసికిన** (మర్దించి ముద్దచేసిన) పులిపిండి కాగలదని అంచనావేయబడినది.[7]

లేఖనములో, పులిసిన పిండి తరుచుగా దుష్ట ప్రభావములతో కూడ ప్రస్తావింబడినది (16:6-12; లూకా 12:1; 1 కొరింథీయులకు 5:6-8; గలతీయులకు 5:9). పస్కాను ఆచరించక మునుపు, యూదులు వారి ఇంటిలో నున్న పులిసిన పిండినంతటిని తీసివేసి దానిని కాల్చివేయవలసి యుండినది. ఇంకా, దేవాలయములో అర్పింపబడుచుండిన నైవేద్యపుటర్పణతో పులిసిన పిండిని అసలే చేర్చకూడదు (లేవీయకాండము 6:14-18). ఈ ఉపమానమును చెప్పుచుండినప్పుడు యేసు తలంపులలో దుష్ట ప్రభావము గూర్చిన ఆలోచన లేదు, ఏలయనగా లోకములో పరలోక రాజ్యము అత్యంత నిర్మాణాత్మకమైన ప్రభావమై యున్నది.

ఈ ఉపమానము యొక్క భావమును యేసు తెలియజేప్పకపోగా, రాజ్యము, సంఘము, లోకమందంతటను ఎలా విస్తరించనై యుండెనో చూపించవలెననునది దాని ఉద్దేశమై యుండినది. రాజ్యము, రొట్టెలోని పులిసిన పిండి వలెనే, ఆ సమయంలో దాచబడి యుండినది. పెంతెకొస్తు దినాన నియమానుసారంగా అది ఒకసారి వ్యవస్థాపింపబడిన పిదప, దాని ప్రభావము త్వరలోనే రోమా సామ్రాజ్యమందంతటను వ్యాపించును (రోమీయులకు 10:18; కొలొస్సయులకు 1:23). పిండిలో దాగియున్న పులుపు వలెనే, పరలోక రాజ్యము మొదట్లో దాదాపుగా బయటకు కనబడి గుర్తింపబడకుండానే పనిచేయును; కానీ అది విస్తరించుచుండు కొలది, దాని ప్రభావము విదితముగా విషదమగుచుండును.

## ఒక విరామము (13:34–43)

**ఉపమానముల ఉద్దేశము (13:34, 35)**

> **[34]నేను నా నోరు తెరచి ఉపమానరీతిగా బోధించెదను,**
> **లోకము పుట్టినది మొదలుకొని మరుగుచేయబడిన**
> **సంగతులను తెలియజెప్పెదను**

**[35]అని ప్రవక్త చెప్పినమాట నెరవేరునట్లు యేసు ఈ సంగతులనన్నిటిని జనసమూహములకు ఉపమానరీతిగా బోధించెను; ఉపమానము లేక వారికేమియు బోధింపలేదు.**

**వచనము 34.** యేసు ప్రభువు ఎల్లప్పుడు ఉపమానములు చెప్పుచునే మాటలాడలేదు, కానీ ఈనాడు ఆయన ఉపమానములను ఉపయోగించాడు. తన దృక్పథమును ఉద్ఘాటించి చెప్పుటకు మత్తయి ఈ సత్యమును నిశ్చయాత్మకముగాను, వ్యతిరేకార్థముగాను నివేదించాడు: **యేసు ఈ సంగతులన్నిటిని జనసమూహములకు ఉపమానములకు ఉపమాన రీతిగా బోధించెను; ఉపమానము లేక వారికేమియు బోధింపలేదు** (యోహాను 1:3తో పోల్చుము).

**వచనము 35.** మరొక పర్యాయము ఈ అధ్యాయములో, యేసు ఉపదేశించిన ఉపమానముల ఉద్దేశము ప్రకటితము చేయబడినది. ఇంతకు మునుపటి సందర్భములో, తన శిష్యులు ఆయన నడిగిన ప్రశ్నకు ప్రభువిచ్చిన సమాధానమును మత్తయి సామాన్యముగా గ్రంథస్థం చేసాడు (13:10–17). ఇచ్చట, మత్తయి యేసు ఆభ్యసించుచుండిన విధానము గూర్చి తానే వ్యాఖ్యానించాడు. ఈ ఉపదేశ విధానము పాత నిబంధనలోని ఒక ప్రవచనము యొక్క నెరవేరై యుండినదని ఆయన నొక్కివక్కాణించాడు. **అని ప్రవక్త చెప్పినమాట నెరవేరునట్లు** అను ప్రకటన ఒక అతిప్రాముఖ్యమైన ఇతివృత్తమును ఈ సువార్తలో కొనసాగించుచున్నది (1:22పై గల వ్యాఖ్యానము చూడు).[8]

కీర్తనలు 78, యేసు ఈ కీర్తనలో నుండే ఉల్లేఖించి చెప్పాడు, దాని సాంప్రదాయిక పైవ్రాతలో ఆసాపు రచించాడని ఆరోపింపబడుచున్నది. దావీదు నియామకము చేసినవారిలో ఆసాపు ఒక ప్రధాన సంగీత శాస్త్రజ్ఞుడై యుండి, "దీర్ఘదర్శి"గా ప్రస్తావింపబడెను (1 దినవృంత్తాంతములు 16:4–7; 25:1, 2; 2 దినవృత్తాంతములు 29:30). ఈ గుర్తింపు "ప్రవక్త" అని 35వ వచనంలో చెప్పబడిన మాటతో ఏకిభవించుచున్నది.[9] కీర్తనలు 78లో, ఆసాపు ఇశ్రాయేలీయుల చరిత్రను ఆధారంచేసుకొని "ఎర్పరచుకొనబడిన జనాంగము గతములో ఎదుర్కొనిన వైఫల్యములనుబట్టి తలెత్తు హెచ్చరికలను ఆయన శ్రోతలు ఆలకించవలెనని" ఆయన వారిని ఆహ్వానించాడు.[10]

నిర్దిష్టముగా, యేసు ఉపమానములు చెప్పుచు ఉపదేశించుచుండిన దాని గూర్చిన ఉల్లేఖనము కీర్తనలు 78:2 నుండి తీసికొనబడినది. **నేను నా నోరు తెరచి ఉపమానము చెప్పెదను** అను మొదటి వరుస, సెప్టువజింట్‌కు సరిపడుచున్నదిగా నున్నది. ఏదిఏమనైనా, రెండవ వరుస. **పూర్వకాలపు గూఢవాక్యములను నేను తెలియజెప్పెదను** స్వేచ్ఛాపూర్వకమైన అనువాదమై యున్నది.[11] ఈ ఉల్లేఖనమును మత్తయి అన్వయించుచున్న దానిలో "మరుగుచేయబడిన" సంగతులు యేసు అదివరకు మాటలాడిన "రాజ్యమును గూర్చిన మర్మములై" యున్నవి (13:11; 1 కొరింథీయులకు 2:7–10; ఎఫెసీయులకు 1:3–14;

3:8-11; కొలొస్సయులకు 2:2, 3 చూడు).

**గురుగులను గూర్చిన ఉపమాన భావము (13:36-43)**

**[36]అప్పుడాయన జనసమూహములను పంపివేసి, యింటిలోనికి వెళ్లగా ఆయన శిష్యులాయనయొద్దకు వచ్చి-పొలములోని గురుగులును గూర్చిన ఉపమానభావము మాకు తెలియజెప్పుమనిరి. [37]అందుకాయన ఇట్లనెను-మంచి విత్తనము విత్తువాడు మనుష్యకుమారుడు; [38]పొలము లోకము; మంచి విత్తనములు రాజ్యసంబంధులు; గురుగులు దుష్టుని సంబంధులు; [39]వాటిని విత్తిన శత్రువు అపవాది; కోత యుగసమాప్తి; కోతకోయువారు దేవదూతలు. [40]గురుగులు ఏలాగు కూర్చబడి అగ్నిలో కాల్చివేయబడునో ఆలాగే యుగసమాప్తియందు జరుగును. [41]మనుష్యకుమారురుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. [42]అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును. [43]అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులుగలవాడు వినునుగాక.**

**వచనము 36**. యేసు జనసమూహములను విడచిపెట్టి **యింటిలోనికి** చేరుకొన్నాడు (13:1). ఇది కపెర్నహూములో, బహుశా పేతురు ఇంటి యొద్ద, లేదా అనామికుడైన ఒక శిష్యుని ఇంటి యొద్ద (4:12-16 చూడు) జరిగిన విషయమై యుండును. ఆ ఏర్పాటులో, **గురుగుల ఉపమానము** గూర్చిన అర్థమును తెలిసికొనవలెనని ఆశించుచుండిన ఆయన శిష్యులు, ఆయన యొద్దకు వచ్చారు (13:24-30 చూడు).

**వచనములు 37-39.** ఈ వచనములలో, యేసు ఉపమానములోని ప్రధానాంశములను గుర్తించి, దాని రూపకాలంకారమయమైన స్వభావమును వివరించాడు.

1. **మంచి విత్తనము విత్తువాడు, మనుష్యకుమారుడు.** విత్తువాని గూర్చిన ఉపమాన వివరములో (13:18-23), విత్తువాడు గుర్తింపబడలేదు; కానీ ఇచ్చట యేసు ఆయనను గూర్చియే మామూలుగా, విత్తువాడు "మనుష్యకుమారుడు" అని పేర్కొనుచున్నాడు.

2. **పొలము, లోకము.** పరలోక రాజ్యమును గూర్చిన ఉపమానములలో అది ఒకటై యున్నందు వలన, మంచి విత్తనము విత్తబడిన "పొలము" సంఘమును సూచించుచున్నదని కొందరనుకొన్నారు. ఏదిఏమైనా, "పొలము, లోకము," నీతిమంతులు మరియు దుర్మార్గులు మిళితమైయున్న స్థలమని యేసు సామాన్యముగా సెలవిచ్చాడు.

3. **మంచి విత్తనములు, రాజ్య కుమారులు.** "మంచి విత్తనము" విత్తువాని ఉపమానములో వలెనే, "రాజ్యము యొక్క వాక్యము" కాదు (13:19); ఇచ్చట అది "రాజ్య కుమారులు" సూచించుచున్నది. మత్తయి 8:12లో, "రాజ్య కుమారులు" అను పదము రాజ్యమునకు సాంప్రదాయికముగా వారసులై యుండిరి, కానీ దానిని తృణీకరించిన యూదులను నిర్దిష్టముగా పేర్కొన్నది. ఇచ్చటి ఈ పదజాలము విశ్వసనీయులైన యేసు శిష్యుల గూర్చి, దేవుని రాజ్యమునకు అసలైన వారసులైయున్నవారి గూర్చి ప్రస్తావించుచున్నది.

4. **గురుగులు, అపవాది కుమారులు.** వీరు అపవాదిని అనుసరించువారై యున్నారు. యేసు రెండు విధములైన "కుమారుల" మధ్య గల వ్యత్యాసమును సుస్పష్టముగా గుర్తించాడు:

ఒకడు రాజ్యపు కుమారుడు లేదా దుష్టుని కుమారుడై యున్నాడు.

5. **వాటిని విత్తిన శత్రువు, అపవాది. సాతాను, శత్రువు.** అని సముచితముగా వర్ణింపబడ్డాడు (లూకా 10:19; 1 పేతురు 5:8 చూడు). దేవుని ప్రజలను అవినీతిపరులను గావించి వారిని నాశనము చేయునట్లు తగిన మార్గములను వెదకుచు, కనుగొనునట్లు వాడు ఎడతెరిపిలేకుండా పన్నుగడలు పన్నుచు, అట్టివాటిని అమలుచేయుటకు ప్రయత్నించుచుండును.

6. **కోత, యుగసమాప్తి.** "కోత" అను పదము లేఖనములలో తరుచుగా తీర్పునకు ఒక రూపకాలంకారముగా ఉపయోగింపబడినది. "అంతము" (*sunteleia*) అను పదము "సంపూర్ణము" లేక "సంపూర్తి" అని కూడ అనువదింపబడవచ్చును (13:40, 49; 24:3; 28:20 చూడు). తీర్పు దినాన తీర్చబడు కడపటి న్యాయస్థాపనము వరకు "రాజ్య కుమారులు" ఈ లోకములో "దుష్టుని కుమారుల" ప్రక్కప్రక్కనే ఉండవలెను.

7. **కోతకోయువారు, దేవదూతలు**. దేవదూతలు, తీర్పును అమలుచేయుచుండు దేవుని ప్రతినిధులుగా లేఖనములలో మరొక చోట చిత్రీకరింపబడి యున్నారు (24:31; ప్రకటన 14:14–20).

**వచనములు 40–42**. ఈ సమయంలో, యేసు **గురుగులు**, **అనగా కూర్చబడి అగ్నిలో కాల్చివేయబడువాటికిని**, మరియు **దుష్టుని కుమారులు, అనగా యుగసమాప్తి యందు తీర్పు తీర్చబడినవారికిని** మధ్య గల ఒక బలమైన సమానాంతరమును బయటికి తెచ్చాడు. కోత కొరకు కోత యజమానుడైన ప్రభువు తిరిగి వచ్చినప్పుడు, వారు **ఆయన రాజ్యములో నుండి** లేక లోకములో నుండి **ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను సమకూర్చుటకు** ఆయన **తన దూతలను** పంపును (16:27; 2 థెస్సలొనీకయులకు 1:6–8 చూడు). దుర్మార్గులు కూర్చబడి, **అగ్ని గుండములోనికి** పడవేయబడుదురు (దానియేలు 3:6; ప్రకటన 20:10, 14, 15 చూడు). ఈ అగ్నిగుండము నరకము, లేక "జహన్నము" (*gehenna*) నకు, ఆరని నిత్యాగ్ని గల స్థలమునకు సూచనయై యున్నది (25:41; మార్కు 9:43, 44 చూడు). మత్తయి వ్రాసిన సువార్తలో తీర్పును చిత్రీకరించుటకు అగ్ని అను పదము నిలకడగా ప్రయోగింపబడినది (3:10; 5:22; 7:19; 13:40, 42; 18:8, 9; 25:41). దుర్నీతిపరులు యాతన కలుగుచుండు స్థలములో నుందురు, **అక్కడ ఏడ్పును పండ్లుకొరకుటయును ఉండును** (8:12; 22:13 చూడు).

**వచనము 43**. తీర్పుకు సంబంధించిన ఆలోచనలను రేకెత్తించు ఉపమానమును యేసు ఆశాజనకమైన గమనికతో ముగించాడు: **అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు** (25:34; 1 కొరింథీయులకు 15:24 చూడు). నిరంతరము నిలచియుండు పట్టణములో, నీతిమంతులు "సూర్యుని" వలె తేజరిల్లుదురు (దానియేలు 12:3; ప్రకటన 21:13; 22:5 చూడు). అటుతరువాత, **చెవులుగలవాడు వినునుగాక** అంటూ యేసు తన శ్రోతలను హెచ్చరించాడు (13:9పై గల వ్యాఖ్యానమును చూడు).

## పరలోక రాజ్యమును గూర్చినవి ఇంకా మూడు ఉపమానములు (13:44–50)

### దాచబడిన ధనము (13:44)

**[44]పరలోక రాజ్యము, పొలములో దాచబడిన ధనమును పోలియున్నది. ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి, అది దొరకిన సంతోషముతో వెళ్లి, తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమును కొనును.**

**వచనము 44.** యేసు **పరలోక రాజ్యమును** గూర్చినవే ఇంకా మూడు ఉపమానములను ఉపదేశించాడు (13:44–50). ఈ మొదటి ఉపమానములో, రాజ్యము, **పొలములో దాచబడిన ధనమును** కనుగొనిన వానికి పోల్చబడినది. ఆ రోజుల్లో, ప్రజలు వారి ప్రశస్తమైన వస్తుసముదాయమును తరుచుగా భూమిలో దాచుకొనుచుండిరి (25:25). ఈ పని "మరి ముఖ్యముగా సంకటములు మరియు విద్రోహ చర్యలు ఎదురైన సమయములలో చేయబడుచుండిరి.[12] మొదటి శతాబ్దము నాటి పాలస్తీనాలో, సమరప్రియులై నేరములు చేయుచు, విద్రోహ చర్యలు చేపట్టుచుండిన ముఠాల వలన, వాటితోపాటుగా అదుపులేకుండా వ్యాప్తిచెందియుండిన అవినీతి వలన కలుగుచుండిన భయముల చేత, వారి ధననిధులను కాపాడుకొనగోరిన ప్రజలు వాటిని భూమిలో దాచుకొనునట్లు వారిని ఉసిగొల్పినవి. ఖుమ్రాన్ పరిశోధనల ఫలితములు ఈ విషయమును సోదాహరణంగా చిత్రీకరించినవి.[13] ఖుమ్రాన్‌లో లభించిన రాగి పత్రముల కట్ట, పాలస్తీనా ప్రజలు వారి నానావిధములైన ధననిధులను, బంగారము, వెండి, సుగంధద్రవ్యములు, మరియు మొదలగు దాచుకొనబడుచుండిన అరవైనాలుగు స్థలముల జాబితాను చేతి రాత ప్రతులు చూపించినది.

ఈ ఉపమానములో పేర్కొనబడినవాడు ఆ ధననిధిపై వాడనుకోకుండానే ఎలా కాలు వేసాడో యేసు వివరించలేదు. అతడు ఇటువంటి నిధుల కొరకే వెదకుచు వేటాడుచుండెనను సూచనలేవియు లేనందు వలన, అతడు దానిని ప్రమాదవశాత్తు కనుగొనియుండునని చెప్పుకొనవచ్చును. ఆ ధనమును కనుగొనిన తరువాత, ఇతరులెవరైనను దానిని కనుగొనకుండునట్లు వాడు దానిని **మరలా దాచిపెట్టాడు**. సంతోషభరితుడై, వాడు తన ఇంటికి వెళ్లి, తనకున్నదంతా అమ్మివేసి, ఆ **పొలమును** కొన్నాడు.

మొదటిసారి చదివినప్పుడు, ఒక ఆధ్యాత్మిక సత్యమును నేర్పించుటకు యేసు ఒక అనైతికమైన అభ్యాసమును ప్రతిపాదించుచుండెనన్నట్లు అది అగుపించవచ్చును (లూకా 16:1–9 చూడు). కానీ ఒకడు ఈ తుది అభిప్రాయమునకు రాక మునుపు, మూడు విషయల గూర్చి యోచింపలెను. మొదటిది, ఈ పొలము ఉచితముగా లభించిన సదవకాశమై యుండినదనుట సాధ్యమే. అసలు సొంతదారు అచ్చట నివసించుట లేదు. గనుక ఆ ధనము సంగతి మర్చిపోబడినది.[14] రెండవది, దానిని కనుగొనినవాడు ఆ పొలములో నున్న సమస్తముతో పాటు దానిని కొనుగోలు చేయుట ద్వారా చట్టము యొక్క పరిధిలోపలనే ప్రవర్తించుచుండెను. పొలమును కొనుగోలు చేయుటలో వాస్తవముగా చేర్చబడియుండిన విషయాల గూర్చి యూదుల మత బోధకులు అటుతరువాత వాదోపవాదములు చేసారు. సొంతదారు తన పొలమును "మరియు దానిలో నున్న

సమస్తమును" అమ్ముటకు అంగీకరించవచ్చును.[15] పొలమును కొనుగోలు చేసినవాడు సొంతదారుని యెడల న్యాయముగా ప్రవర్తించవలెనను అవగాహన కలిగియుండెనను వాస్తవము మూడవ యోచనయై యున్నది. లేదంటే, అతనికి ధననిధి లభించిన మరు క్షణమే అతడు దానితోపాటు పరుగెత్తి పారిపోయి యుండెడివాడే. అలా చేయకుండా, ధననిధి న్యాయసమ్మతముగా తనదైయుండునట్లు ఆ పొలమును కొనుగోలుచేయగోరాడు.[16]

ఈ ఉపమానము యొక్క అసలు భావమును అర్థంచేసికొనకుండునట్లు మనము ఇతని నీతిమంతమైన గుణముల గూర్చి మితిమీరి ఆందోళనచెంద నవసరములేదు. యేసు తెలియజెప్పగోరిన ముఖ్య విషయము పరలోక రాజ్యము యొక్క విలువకు సంబంధించినదై యున్నది. అతడు అదృష్టవంతుడై దానిని కనుగొనినవాడు ఆ ధనము దాచబడియుండిన పొలమును సొంతం చేసికొననట్లు తాను కలిగియుండిన సమస్తమును త్యాగము చేయుటకు ఇష్టపడుచుండెను. దేవుని రాజ్యము యొక్క గొప్పతనమును గ్రహించువాని గూర్చిన వాస్తవమైన సంగతి కూడ ఇదే. ఆ రాజ్యమును సొంతంచేసికొనునట్లు ఒకడు చెల్లించు మొత్తము ఎంతటి విలువగలదైనప్పటికిని, ఆ రాజ్యము విలువను మించునంతటి ప్రశస్తమైనది కాదు (6:33; లూకా 18:28–30; ఫిలిప్పీయులకు 3:8, 9).

### మంచి ముత్యము (13:45, 46)

**45మరియు పరలోకరాజ్యము, మంచి ముత్యములను కొన వెదకుచున్న వర్తకుని పోలియున్నది. 46అతడు అమూల్యమైన యొక ముత్యమును కనుగొని, పోయి తనకు కలిగినదంతయు అమ్మి దాని కొనును.**

**వచనములు 45, 46.** యేసు, అటుతరువాత, **రాజ్యమును మంచి ముత్యములను కొన వెదకుచున్న వర్తకుని**తో పోల్చాడు. బైబిలు కాలములోని అత్యంత ప్రశస్తమైన వజ్రముల తరగతిలో "మంచి ముత్యములు" కూడ ఉండినవి (యోబు 28:18; మత్తయి 7:6; 1 తిమోతి 2:9; ప్రకటన 17:4; 18:11–17; 21:21).[17] నత్త, కురువింద మొదలగు వాటి జాతికి చెందిన జంతువుల చిప్పల లోపల ఉత్పత్తియగుచుండి, ఎర్ర సముద్రము మరియు పర్షియా సముద్రపాయలో లోయీతగాళ్ల చేత ముత్యములు పండింపబడుచుండినవి. ఈ కథలోని "వర్తకుడు" (*emporos*) "చిల్లర వ్యాపారి"కి (*kapēlos*) తారతమ్యముగా ఒక "టోకు వ్యాపారి"యై యుండెను.[18] అతడు తన వ్యాపార రీత్యా సుధీర్ఘమైన ప్రయాణములు చేయవలసి యుండినది. మంచి ముత్యములను తిరిగి అమ్మకము చేయవలెనను వేటలో, **అతడు అమూల్యమైన యొక ముత్యమును కనుగొన్నాడు**. అది అతడు తనకు కలిగినదంతయు అమ్మి దాని కొనునంతటి గొప్ప విలువగలదై యుండెను.

ఇదివరకటి ఉపమానము వలె (13:44), ఈ కథ కూడ దేవుని రాజ్యమునకు గల బ్రహ్మాండమైన విలువను గూర్చి నేర్పించుచున్నది. ఈ రెండు ఉపమానముల నడుమ గల తేడా ఏమనగా, మొదటివాడు ప్రత్యేకముగా దాని కొరకే వెదకుచుండనప్పటికిని ఆ ధనమును (రాజ్యమును) ప్రమాదవశాత్తు కనుగొన్నాడు. అతనికి, ఆ ధనమును కనుగొనుట ఆశ్చర్యకరమైన విషయమై యుండినది. రెండవ వాడు, ముత్యముల కొరకు వెదకుచుండినందు వలన, అమూల్యమైన యొక ముత్యమును (రాజ్యమును) కనుగొనినప్పుడు

ఆతడు వాస్తవముగా ఆశ్చర్యపడలేదు. అట్లయినను, అతడు ఆనందించాడు. ఈ రెండు ఉపమానములకు గల పోలిక ఏమనగా ఇంత గొప్ప ధననిధిని ఉచితలాభంగా పొందుటకు వారు కలిగియుండిన సమస్తమును త్యాగము చేయుటకు ఈ ఇరువురును ఇష్టపడుచుండిరి.

**వల (13:47–50)**

**[47]మరియు పరలోకరాజ్యము, సముద్రములో వేయబడి నానావిధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది. [48]అది నిండినప్పుడు దానిని దరికి లాగి, కూర్చుండి, మంచి వాటిని గంపలలో చేర్చి చెడ్డవాటిని బయట పారవేయుదురు. [49]ఆలాగే యుగసమాప్తియందు జరుగును. దేవదూతలు వచ్చి నీతిమంతులలోనుండి దుష్టులను వేరుపరచి [50]వీరిని అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును.**

**వచనములు 47, 48.** ఈ ఉపమానముల గుంపులోని **పరలోక రాజ్యమును** గూర్చిన మూడవ ఉపమానములో (13:44–50) "dragnet" (*sagēnē*) **సముద్రములో వేయబడి నానావిధములైన చేపలను పట్టిన ఒక వల** కలిసియున్నది. "Seine" అను ఆంగ్ల పదము ఉత్పన్నమైన "నానా విధములైన చేపలను పట్టిన వల" అను అర్థమిచ్చుచున్న గ్రీకు పదము, నీటిపై తేలియాడునట్లు దాని పైభాగములో కట్టబడిన తేలికయైనవి మరియు అది విప్పుకొనిన తరువాత మునిగియుండునట్లు దాని క్రింది భాగములో కట్టబడిన బరువైన వస్తువులు కలిగియున్న చేపలను పట్టు ఒక భారీ వలన సూచించినది. ఈ వల రెండు దోనెల నడుమ లేదా దోనె మరియు తీరమున నున్న ఒక ఆధారమునకు మధ్య కట్టబడవచ్చును. ఈ వల అనేక వందల పౌండ్ల బరువున్న చేపలను అది పిగిలిపోకుండా పట్టగల సామర్థ్యముగలదై యున్నది.

ఈ ఉపమానములో, నానావిధములైన చేపలను పట్టగల వల నీటిలోనికి విసరబడినప్పుడు, **ప్రతి విధమైన చేప** అందులో చిక్కుకొనుచుండినది. దొరికిన చేపలన్నియు తీరమునకు తీసికొనిరాబడినవి, అచ్చట **మంచి చేపలు చెడ్డ చేపల** నుండి వేరుచేయబడినవి. "చెడ్డ" (*sapros*) అను విశేషణమునకు "చెడిపోయిన" లేక "మురిగిపోయిన" అను పదములు అక్షరార్థములై యున్నవి. ఏదిఏమైనా, అది "చెడ్డది," "దుష్ట," లేక "అనారోగ్యముగానున్న" దానిని రూపకాలంకారముగా సూచించగలదు.[19] ఈ చేపలు తాజాగా పట్టబడినవై యుండినందు వలన, ఆ చేపలు "చెడిపోయినవై" లేదా "మురిగిపోయినవై" యుండుట చాలా వరకు అసంభవము. సరికదా, "చెడ్డ" అను పదము బహుశా యూదులు తినకూడదని ఆజ్ఞాపింపబడిన చేపలను సూచించవచ్చును. అపవిత్రమైన ఈ చేపలు రెక్కలుగాని, పొలుసులుగాని కలిగియుండలేదు (లేవీయకాండము 11:10, 11), గనుక మంచి చేపల నుండి ఇవి సులభముగా వేరుచేయబడినవి. క్రేయిగ్ ఎస్. కీనర్ ఇలా వ్రాయుచున్నాడు, "గలిలయ సముద్రములో కనీసము ఇరువది నాలుగు జాతులకు సంబంధించిన చేపలు గలవని లెక్కింపబడిన వాటిలో, అనేకమైనవి అపవిత్రమైనవై యుండినవి లేదా అవి ఆహారముగా సేవించుటకు వీలుకానివై యుండినవి, మరియు దానిలో పడిన చేపలు ఏ యే రకములైనవో వల గుర్తించజాలదు."[20] చెడ్డ చేపలకు విలువే లేదు; జాలరులు వాటిని కేవలము పారవేయుదురు. ఏదిఏమైనా, మంచి చేపలు అంగడిలో అమ్మబడినవి.

**వచనములు 49, 50.** గురుగుల గూర్చిన ఉపమానము వలెనే, ఈ కథ కూడ **యుగసమాప్తి యందు** జరుగనై యున్న తీర్పుకు సంబంధించినదై యున్నది (13:40 చూడు). మరొక పర్యాయము, **నీతిమంతుల నుండి దుష్టులను** వేరుచేయుటకు **దేవదూతలు** బాధ్యులై యున్నారు (13:41 చూడు). ఇచ్చట దుష్టులకు ఇవ్వబడు శిక్ష గూర్చి మాత్రమే పేర్కొనబడినది. దేవదూతలు **వారిని అగ్నిగుండములో పడవేయుదురు, అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును** (13:42 చూడు). రాజ్యము విషయములో ఎవరు విశ్వాసనీయమైన పౌరులై యున్నారో, ఎవరు లేరో తీర్పు దినము బయలుపర్చును.

## ఇంటి యజమానుని ఉపమానము
## (13:51, 52)

**51వీటన్నిటిని మీరు గ్రహించితిరా అని వారిని అడుగగా వారు – గ్రహించితి మనిరి. 52ఆయన–అందువలన పరలోకరాజ్యములో శిష్యుడుగాచేరిన ప్రతిశాస్త్రియు తన ధననిధిలోనుండి క్రొత్త పదార్థములను పాత పదార్థములను వెలుపలికి తెచ్చు ఇంటి యజమానుని పోలియున్నాడని వారితో చెప్పెను.**

ముగింపులో తెలియజెప్పబడుచున్న ఈ ఉపమానము పరలోక రాజ్యములో ఉన్నవారు ఒకరికొకరు ఎలా ఉపదేశించుకొనగలరో యను విషయమును ఉద్ఘాటించి చెప్పుచున్నట్లు అగుపించుచున్నది. అటుతరువాత, వారు సువార్త ప్రకటన నిమిత్తము బయలుదేరి వెళ్లినప్పుడు బోధింపవలసిన సంగతులను, వారికి యేసు ఉపదేశించుచుండిన బోధలన్నిటిలో నుండి వారు నేర్చుకొనవలసియుండినది.

**వచనము 51**. వినుట వేరు, విన్నదానిని గ్రహించుట వేరు. వాస్తవమునకు, ఒకడు ప్రసంగములోని ప్రతి మాటను వినవచ్చును, విన్న ప్రతి మాటను ఉన్నది ఉన్నట్టుగా వల్లించవచ్చును కూడ, అట్లయినను చెప్పబడిన విషయమేమిటో కొంచమైనను గ్రహించకపోవచ్చును. యేసు బోధించిన విషయాలన్నిటిని వారు గ్రహించునట్లు శిష్యులు ఆయన వారికి ఉపదేశించిన **వీటన్నిటిని** మేళవించారు. యేసు అడిగిన ప్రశ్నకు శిష్యులిచ్చిన నిశ్చయాత్మకమైన సమాధానము నుండి, ఆయన ఉపదేశములను వారు గ్రహించారని స్పష్టమగుచున్నది.

**వచనము 52**. ఈ వచనములో అధ్యాయములోని ముగింపు ఉపమానమున్నది, గనుక దాని ఖచ్చితమైన భావము మనలను సవాలు చేయుచున్నది. **పరలోక రాజ్యములో శిష్యుడుగా చేరిన ప్రతి** శాస్త్రిని యేసు సూచించుచుండెను. "శాస్త్రి," పాత నిబంధన నకలు రాయుచుండినవాడై యుండెను. ఈ అభ్యాసమొక్కటే అతనిని లేఖనములలో విజ్ఞానవంతుని జేయును. అంతమాత్రమేగాక, ఒక "శిష్యుడు" అగుటలో, ఒక శాస్త్రి యేసు ఉపదేశములను నేర్చుకొనినవాడై యుండును (8:19; అపొస్తలుల కార్యములు 4:13 చూడు). ఇటువంటి వానిని ప్రభువు **తన ధననిధిలో నుండి క్రొత్త పదార్థములను పాత పదార్థములను వెలుపలికి తెచ్చు ఇంటి యజమానునితో** పోల్చాడు. గ్రీకు పదము *thēsauros* "ధననిధి"ని లేక ధనము దాచబడియుండు పాత్రను, అనగా ఒక "ధన నిధి పెట్టె"ను లేక "గిడ్డంగి"ని సూచించుచున్నది (2:11; 6:19; 12:35పై గల వ్యాఖ్యానము చూడు). "పాత" ధననిధులు

పాత నిబంధన లేఖనములలోని సత్యములకును, "కొత్త" ధననిధులు యేసు ఉపదేశించిన నూతన ఉపదేశములకును ప్రతినిధులై యుంటున్నవి.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

**పులిసిన సువార్త (13:33)**

యేసు దాని వివరమును చెప్పకుండానే పులిసిన పిండిని గూర్చిన ఉపమానమును చెప్పాడు, కానీ పులిసిన పిండి యొక్క గుణగణాల ఆధారంగా ఆయన ఏమి బోధించుచుండెనో మనము అర్థం చేసినకొనవచ్చును.

1. *పులుపు, పిండిలోని లోపలి భాగమునుండి పనిచేయుచుండును.* అదే విధముగా, దేవుని పరిశుద్ధాత్మ ఒకని హృదయాంతరంగములో పనిచేయును. ఈ రోజుల్లో మన హృదయములలో నివసించుచున్న అదే పరిశుద్ధాత్మ, వారు సువార్తను ప్రకటించు నిమిత్తము సర్వలోకమునకు వెళ్లునట్లు ఆది క్రైస్తవులను పురికొల్పాడు. మంచి మరియు నిజాయితీపరులైన వారి హృదయములలో నాటబడిన సువార్త వారు రూపాంతరము నొందునట్లు చేయును.

2. *పులిసినపోవు ప్రక్రియ నిధానముగా జరుగును.* సువార్త యొక్క రుచికరమైన పులుపు ప్రతి క్రైస్తవ విశ్వాసి జీవితములో ఉండవలెను, అది ఒకరి హృదయములో నుండి మరొకరి హృదయము లోనికి పొర్లిపారుచుండవలెను. సువార్త అగ్ని పర్వతము వలె, ఆకస్మిక విభ్రాంతి కలుగుజేయదు, కానీ నిదానముగాను, నిలకడగాను పనిచేయును.

3. *పులుపు, పిండిలోనే సహజసిద్ధముగా ఏర్పడదు; అది కలుపబడవలెను.* సువార్త యొక్క రుచికరమైన పులుపు మానవాధార మూలమైనది కాదు, కానీ అది పాపమునకు దైవికమైన చికిత్సయై యున్నది (యాకోబు 1:21). క్రైస్తవుల చేత సువార్త సర్వలోకమునకు చాటింపబడవలసి యున్నది (28:18–20). పులుపు, పిండిలో వెనువెంటనే పనిచేయునట్లుగా, సువార్త దాని నంగీకరించినవారి హృదయములో వెంటనే పనిచేయును.

4. *ఉపమానములో పేర్కొనబడిన పులుపు ఏదో ఒకే ఒక్క స్థలములో ఉండలేదు.* అది ముప్పావు కుంచము పిండంతటిలో కలుపబడినది. సువార్త వ్యాపకములో సహితము ఇదే మాత్రము అనుసరింపబడవలెను: దేవుని రక్షణ సందేశము అంతకంతకు అధిక సంఖ్యాకులకు అందజేయబడునట్లు ప్రతి సమాజములో చిన్న చిన్న సభలకు ప్రారంభించవలెను.

**రాజ్య విలువ (13:44–46)**

మత్తయి 13:44–46లో వ్రాయబడి యున్నట్లు, యేసు చెప్పిన రెండు ఉపమానములు పరలోక రాజ్యము యొక్క ప్రశస్తతను ప్రదర్శించుచున్నవి. ఇటువంటి పాఠము మనకవసరమా? ఎందుకవసరము? అవసరమనుటకు కొన్ని హేతువులు:

1. *దాని విలువ, దాని వెలనుబట్టి నిర్ధరింపబడుతోంది.* రాజ్యము, లేక సంఘము, ఎప్పుడైనాగాని రూపొందింపబడిన అత్యధిక వెలగల వ్యవస్థయై యున్నది. దాని వ్యవస్థాపనకు యేసు క్రీస్తు యొక్క అమూల్యమైన రక్తము అవసరమయ్యింది (1 పేతురు 1:18, 19).

2. *దాని విలువ, దాని ప్రయోజనముల ద్వారా ప్రదర్శింపబడినది.* మనము ఇతర

విషయముల విలువను అంచనావేయు విధానమును దృష్టిలో ఉంచుకొనుచు, మనలను మనము ఒక ప్రశ్న అడుగుకొందము, "సువార్త వలన సంఘమునకు చెందియుండువారికి కలుగు ప్రయోజనములేమిటి?"

3. *దాని విలువ, దాని సొంతదారు చేత నిర్ధరింపబడుతోంది.* సంఘము, క్రీస్తు సొత్తు. ఆయన దానిని కట్టునని వాగ్దానము చేసియున్నాడు (16:18. 19), గనుక అంత్య దినమున ఆయన దానిని తన తండ్రి చేతికి అప్పగించును (1 కొరింథీయులకు 15:24).

4. *దాని విలువ, దాని మహత్కార్యము ద్వారా చూపించబడినది.* నిత్య రక్షణ నిమిత్తము ఇతరులను క్రీస్తు యొద్దకు తీసికొనిరాగలునట్లు, లోకముతో సువార్తను పంచుకొనుట సంఘము యొక్క బృహత్కార్యమై యున్నది.

5. *దాని విలువకు దాని భవిష్యత్తు ద్వారా తీర్పు తీర్చబడుతోంది.* సంఘము యొక్క విశ్వసనీయులైన సభ్యులు యేసుక్రీస్తు యెదుట నిలువబెట్టబడుదురు గనుక వారు ఆయనతో కూడ ఏలుచు తీర్పు తీర్చుదురు (1 కొరింథీయులకు 6:2; ఎఫెసీయులకు 5:25–27). సంఘములో చేరుటకు నిరాకరించుచు వెలుపలనే యుండగోరువారు నిత్యత్వములో దేవుని సన్నిధి నుండి వెలుపలనే యుంచబడుదురు (2 థెస్సలొనీకయులకు 1:9; 1 పేతురు 4:17).

### దాచబడిన ధనము గూర్చిన ఉపమానము (13:44)

దాచబడిన ధనమును గూర్చిన ఉపమానము మనకు ముఖ్యమైన మూడు పాఠములను నేర్పించుచున్నది.[21]

1. *ధనము.* పరలోక రాజ్యము, ధననిధులన్నిటిలో కెల్ల అతి గొప్ప ధననిధియై యున్నది. అది ఒకడు కలిగియున్న సమస్త సొత్తులు మరియు శక్తులను మించిన విలువగలదై యున్నది. దాని విలువకు సాటియైన విలువగలదేదియును లేదు.

2. *త్యాగము.* దాచబడిన ధనమును కనుగొనినప్పుడు, దానిని పొందుటకు అతడు తాను కలిగియుండిన సమస్తమును త్యజించాడు. రాజ్య పౌరుడై యుండునట్లు, అవసరమైన త్యాగములు చేయుటకు ఒకడు ఇష్టపడుచుండవలెను. శిష్యత్వము నిమిత్తము ఒకడు తనను తాను ఉపేక్షించుకొనుట ఆవశ్యకమై యున్నది (16:24).

3. *సంతోషము.* దాచబడిన ధనమును కనుగొనినవాడు, అతనికి ప్రాప్తించిన ధనము యొక్క మిన్నయైన విలువనుబట్టి ఆ పొలమును కొనుగోలు చేయునట్లు తనకు కలిగినదంతయు ఆనందముతో అమ్మివేయుటకు సంసిద్ధుడై యుండెను. ఒకడు క్రీస్తు మరియు ఆయన రాజ్యము యొక్క గొప్ప నిధి గూర్చి వాస్తవముగా తెలిసికొనినప్పుడు, శిష్యత్వ త్యాగముల గూర్చి అతడు విచారపడడు. దానికి మారుగా, రాజ్యములో భాగస్థుడగు ప్రత్యేకార్హత లభించినందులకు అతడు అమితంగా ఆనందించును.

డేవిడ్ స్టూవర్ట్

సూచనలు

[1]F. N. Hepper, "Plants," in *New Bible Dictionary*, 2d. ed, ed. J. D. Douglas and Norman Hillyer (Wheaton, Ill.: Tyndale House Publishers, 1982), 948 [2]Mishnah *Tohoroth* 8.8; *Niddah*

5.2 చూడు. [3]Talmud *Ketuboth* 111b. [4]W. F. Albright and C. S. Mann, *Matthew*, The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1971), 169. [5]*1 Enoch* 90.30, 33, 37. [6]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 353 చూడు. [7]Craig S. Keener, *The IVP Bible Background Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 84. [8]కొన్ని ప్రాచీన ప్రతులు ప్రవక్త "ప్రవక్త "యెషయా"యై యున్నాడని ప్రత్యేకముగా పేర్కొనుచున్నవి, కానీ ఇది సరైనది కాదని స్పష్టమగుచున్నది. Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament,* 2d ed. (Stuttgart: German Bible Society, 1994), 27 లో గల చర్చను చూడు. [9]కీర్తనకారుడైన దావీదు కూడ ఒక "ప్రవక్త" అని అపొస్తలుల కార్యములు 2:29, 30లో ప్రస్తావింపబడి యున్నది. [10]Eddie Cloer, *Psalms 51-89,* Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2006), 484.

[11]"లోకసంబంధమైన" అని కొన్ని చేత రాత ప్రతులలో లేదు (Metzger, 28). [12]Albright and Mann, 170. [13]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 238. [14]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 124. [15]Mishnah *Baba Bathra* 4.8, 9. [16]దాచబడిన ధనమును కనుగొనువాడు ఏ యే వస్తువులను తన యొద్ద ఉంచుకొనవచ్చునో యని యూదా మత బోధకులు కూడ తర్జనభర్జన గావించారు. (Talmud *Baba Metzia* 25a; Jerusalem Talmud *Baba Metzia* 2.5.) [17]Albright and Mann, 170. [18]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d. ed, rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 325. [19]Ibid., 913. [20]Keener, *Matthew*, 392.

[21]Neil R. Lightfoot, *Lesson from the Parables* (Grand Rapids, Mich.: Baker Book House, 1965), 40-41 నుండి అనుకూలించుకొనబడినది.